వీవీ ప్యాట్లలో సింబల్స్ లోడింగ్ ప్రక్రియ పూర్తి

● సనత్‌నగర్ నియోజకవర్గంలో 283 వీవీ ప్యాట్లు సిద్ధం

సనత్‌నగర్: ఈనెల 13న జరగనున్న సికింద్రాబాద్ పార్లమెంట్ ఎన్నికల ఏర్పాట్లలో అధికారులు వడివడిగా అడుగులు వేస్తున్నారు. పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని సనత్‌నగర్ నియోజకవర్గానికి సంబంధించి వీవీ ప్యాట్లలో అభ్యర్థుల గుర్తులను లోడ్ చేసే ప్రక్రియ ఆదివారం కొనసాగింది. సికింద్రాబాద్ పార్లమెంట్ ఎన్నికల రిటర్నింగ్ అధికారి హేమంత కేశవపాటిల్, సహాయ రిటర్నింగ్ అధికారులు వీరారెడ్డి, సమ్మయ్య, భీమయ్యగౌడ్‌ల పర్యవేక్షణలో ఉదయం నుంచి రాత్రి వరకు సింబల్స్ లోడింగ్ తంతు కొనసాగించారు. సనత్‌నగర్ నియోజకవర్గంలో 229 పోలింగ్ బూత్‌లు ఉండగా.. 229 వీవీ ప్యాట్లకు అదనంగా 25 శాతంగా 57 వీవీ ప్యాట్లను సిద్ధం చేశారు. మొత్తం 283 వీవీ ప్యాట్లను అందుబాటులో ఉంచారు. సికింద్రాబాద్ పార్లమెంట్‌కు 45 మంది అభ్యర్థులు బరిలో నిలవగా.. ఇప్పటికే వారికి గుర్తు కేటాయింపు ప్రక్రియ పూర్తి చేసుకున్నారు. వాటిని వీవీ ప్యాట్లలో అమర్చే ప్రక్రియను కూడా రాజకీయ నాయకుల సమక్షంలో పూర్తి చేశారు.

● సనత్‌నగర్ నియోజకవర్గ డీఆర్‌సీ, స్ట్రాంగ్ రూమ్ సెంటర్, ఓయూ కామర్స్ అండ్ మేనేజ్‌మెంట్ కళాశాల భవనంలో పోలీసుల పహారాను కట్టుదిట్టం చేశారు. వీవీ ప్యాట్లలో సింబల్స్ లోడింగ్ కోసం పోలింగ్ అధికారులు నియమించిన సిబ్బందిని మినహాయించి ఇతరులను ఎవరినీ లోనికి అనుమతించలేదు. లోడింగ్ ప్రక్రియ పూర్తయిన తర్వాత ప్రింట్‌ను పరిశీలించారు. అనంతరం వాటికి సీల్ వేసి తిరిగి స్ట్రాంగ్ రూమ్‌లో భద్రపరిచారు.

బీఆర్‌ఎస్ ఇంటింటి ప్రచారం

అడ్డగుట్ట: బీఆర్‌ఎస్ పార్టీ సికింద్రాబాద్ అభ్యర్థి పద్మారావుగౌడ్‌కు మద్దతుగా కార్పొరేటర్ ప్రసన్నలక్ష్మి ఆదివారం అడ్డగుట్టలోని ఏ,బీ,సీ, డీ సెక్షన్లలో ఎన్నికల ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఇంటింటికీ తిరుగుతూ.. కారు గుర్తుకు ఓటువేసి పద్మారావుగౌడ్‌ను గెలిపించాలని ప్రజలను కోరారు. కాంగ్రెస్ పార్టీ చేసిన అబద్ధపు హామీలతోనే మళ్లీ పార్లమెంట్ ఎన్నికల్లో కూడా ప్రజలను మోసం చేయాలని చూస్తుందని ఆరోపించారు. బీజేపీ పార్టీ దేవుడి పేరుతో ఓట్లను అడగడం తప్పా.. చేసిందేమిలేదన్నారు. కారు గుర్తుకు ఓటువేసి బీఆర్‌ఎస్ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. శ్రీనివాస్, మధు, శ్రీనివాస్‌గౌడ్, ఎల్లయ్య, మహ్మద్, రాజు, అమర్, గౌస్, రామస్వామి, మల్లేష్, నర్సింగ్ పాల్గొన్నారు.

సనత్‌నగర్: సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ బీఆర్‌ఎస్ అభ్యర్థి పద్మారావుగౌడ్ గెలుపును కాంక్షిస్తూ ఆ పార్టీ శ్రేణులు ఆదివారం సనత్‌నగర్ డివిజన్‌లో ఇంటింటి ప్రచారం చేశారు. బీఆర్‌ఎస్ డివిజన్ అధ్యక్షుడు కొలను బాల్‌రెడ్డి ఆధ్వర్యంలో ఎస్ఆర్టీ కాలనీ, నాగరాజేశ్వరినగర్‌లో కార్యకర్తలతో కలిసి ఓటును అభ్యర్థించారు. కొలను భూపాల్‌రెడ్డి, ఆకుల రాజు, విజయ్‌సింగ్, సత్యనారాయణయాదవ్, రాజేష్‌ముదిరాజ్, పురుషోత్తం, ఝాన్సీరెడ్డి, పుష్పలత, పద్మ, సరితగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

రక్తపుమడుగులో యువకుడు

అమీర్‌పేట్: ఎస్ఆర్‌నగర్ పోలీస్‌స్టేషన్ ఎదుట ఓ యువకుడు తీవ్ర గాయాలతో రక్తపు మడుగులో కనిపించడం కలకలం రేపింది. స్థానికుల సమాచారంతో స్థానికులు బాధితుడిని ఆసుపత్రికి తరలించారు. వివరాల ప్రకారం.. ఆదివారం రాత్రి 9.15 గంటల ప్రాంతంలో సుమారు 30 ఏళ్ల వ్యక్తి రక్తపు గాయాలతో ఎస్ఆర్‌నగర్ పోలీస్‌స్టేషన్ వెనుక వైపు గేటు ముందు పడి ఉండటంతో స్థానికులు పోలీసులకు సమాచారం అందించగా.. వారు బాధితుడిని 108 ద్వారా ఆసుపత్రికి తరలించారు. బాధితుడి పేరు ప్రసాద్ అని, గుడి మల్కాపూర్‌లో ఉంటానని తెలిపాడు. తలకు తీవ్ర గాయాలై ఉండటంతో ఏదైనా గుర్తుతెలియని వాహనం ఢీకొని ఉంటుందని పోలీసులు అనుమానిస్తున్నారు.

ఆ పార్టీలకు ఓటేస్తే ఒరిగేదేమి లేదు..

బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి పద్మారావుగౌడ్



ఎన్నికల పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించిన తలసాని, పద్మారావుగౌడ్



సమావేశంలో మాట్లాడుతున్న వెంకట్‌రెడ్డి

బన్సీలాల్‌పేట్: ప్రజల విశ్వాసాన్ని కోల్పోయిన కాంగ్రెస్, ప్రజా సమస్యలను పట్టించుకోని బీజేపీ పార్టీలను ప్రజలు ఈ ఎన్నికల్లో తగిన బుద్ధి చెబుతారని బీఆర్‌ఎస్ అభ్యర్థి పద్మారావుగౌడ్, మాజీమంత్రి, ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్‌ను అన్నారు. బన్సీలాల్‌పేట్ డివిజన్ పద్మారావునగర్‌లో ఆదివారం ఎన్నికల ప్రచార కార్యాలయాన్ని వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. నిలకడలేని దానం నాగేందర్, అభివృద్ధిపై చిత్తశుద్ధిలేని కిషన్‌రెడ్డిలను ప్రజలు ఓడించాలని విజ్ఞప్తి చేశారు. ఎన్నికల ప్రచారంలో నగర ప్రజలు బీఆర్‌ఎస్‌కు బ్రహ్మరథం పడుతున్నారని, తమ విజయం ఖాయమని పద్మారావు ధీమా వ్యక్తం చేశారు. నాడు సీఎం కేసీఆర్ నాయకత్వంలోని బీఆర్‌ఎస్ ప్రభుత్వం నగరాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేసిందన్నారు. దేశంలోని అన్ని నగరాలకు ధీటుగా హైద్రాబాద్‌ను విశ్వనగరంగా చేసిన ఘనత బీఆర్‌ఎస్‌కు దక్కుతుందన్నారు. అన్ని వర్గాల ప్రజలు తమ వెంటే ఉన్నారన్నారు. ఈ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ పార్టీ సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గంలో జెండా ఎగుర వేసి చరిత్ర సృష్టిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్పొరేటర్ కె.హేమలత, నాయకులు వెంకటేషన్, ఏసూరి మహేష్, పవన్‌కుమార్‌గౌడ్, వెంకటరమణ, ముక్కా శ్రీనివాస్, శ్రీకాంత్‌రెడ్డి, పుష్పంత్‌రెడ్డి, రామేశ్వర్‌గౌడ్, కిరణ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

రాంగోపాల్‌పేట్: కాంగ్రెస్, బీజేపీ పార్టీలకు చెందిన అభ్యర్థులకు పార్లమెంట్‌లో ఓటువేస్తే ప్రజలకు ఒరిగేదేమి లేదని బీఆర్‌ఎస్ సికింద్రాబాద్ ఎంపీ అభ్యర్థి పద్మారావుగౌడ్ అన్నారు. ఆదివారం మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్‌తో కలిసి వందలాది మంది కార్యకర్తలతో ఆయన ప్రచారాన్ని మినిస్టర్ రోడ్డులోని సాయిబాబా దేవాలయం నుంచి ప్రారంభించారు. అనంతరం కాచిబోలి, వెంగళరావునగర్, సీలైన్, ఎఫ్‌లైన్, గైదీన్‌బాగ్, నల్లగుట్ట తదితర ప్రాంతాల్లో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక నాయకులు కల్లు గీసేందుకు ఉపయోగించే లొట్టి, మోకు, ముస్తాక్‌లను అందించారు. అడుగడుగునా మహిళలు మంగళహారతులతో వారికి ఘన స్వాగతం పలుకుతూ.. శాలువాలతో సత్కరించారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలు బీఆర్‌ఎస్ పార్టీ అభ్యర్థులను గెలిపించి తమ అభిమానాన్ని చాటుకున్నారని అదే అభిమానాన్ని ఇప్పుడు చూపించేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. సికింద్రాబాద్ పార్లమెంటు పరిధిలోని 7 నియోజకవర్గాల్లో ఇప్పటి వరకు కిషన్‌రెడ్డి ఏ ఒక్క నియోజకవర్గంలోనైనా అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టారా అని ప్రశ్నించారు. కార్పొరేటర్ మహేశ్వరి, మాజీ మాజీ కార్పొరేటర్లు అరుణగౌడ్, కిరణ్మయి నాయకులు శ్రీనివాస్‌గౌడ్, కిషోర్, ఆంజనేయులు, గణేష్, సతీష్, సత్యనారాయణ, కోటేశ్వర్, జనార్దన్ తదితరులు పాల్గొన్నారు.

పద్మారావును అత్యధిక మెజార్టీతో గెలిపించాలి..

అమీర్‌పేట: సికింద్రాబాద్ పార్లమెంట్ బీఆర్‌ఎస్ పార్టీ అభ్యర్థి తీగుళ్ల పద్మారావుగౌడ్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని సనత్‌నగర్ నియోజకవర్గ ఇన్‌చార్జి వెంకట్‌రెడ్డి కోరారు. అమీర్‌పేట డివిజన్ అధ్యక్షుడు ఎం.హనుమంత్‌రావు, పార్టీ సీనియర్ నాయకులు అశోక్ యాదవ్ ఆధ్వర్యంలో ఆదివారం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. మచ్చలేని నాయకుడు, ప్రజలకు ఎల్ల వేళలా అందుబాటులో ఉండే ఉద్యమకారుడైన పద్మారావుగౌడ్‌ను గెలిపించి పార్లమెంట్‌కు పంపించాల్సిన అవసరం ఉందని తెలిపారు. తద్వారా సికింద్రాబాద్ పార్లమెంట్ పరిధిలో అన్ని ప్రాంతాలు అభివృద్ధి చేస్తారన్నారు. పార్టీ నేతలు కూతురు నర్సింహ, వనం శ్రీనివాస్, గులాబ్‌సింగ్, కట్ట బల్‌రాం, రాణికార్, శ్రీలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ నేతల ఇంటింటి ప్రచారం



ఎన్నికల ప్రచారంలో మాజీ మేయర్ బండ కార్తీకరెడ్డి

బౌద్ధనగర్: సికింద్రాబాద్ బీజేపీ ఎంపీ అభ్యర్థి కిషన్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపిస్తామని బీజేపీ నాయకులు అన్నారు. ఆదివారం డివిజన్‌లోని పలు బస్తీల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. బీజేపీ అధికారంలో దేశం సుభిక్షంగా ఉందని, మళ్లీ కేంద్రంలో బీజేపీ అధికారంలోకి రావాలని కోరారు. సికింద్రాబాద్ పార్లమెంట్ పరిధిలో కిషన్‌రెడ్డి చేసిన అభివృద్ధి పనులు ఆయనను గెలిపిస్తాయన్నారు. బీజేపీ సికింద్రాబాద్ కో–కన్వీనర్ దత్తు, భాస్కర్‌గౌడ్, వనమాల శ్రీను, శ్రీనివాస్‌రెడ్డి, దీపక్ పాల్గొన్నారు.

ఈవీఎం నమూనాతో బీజేపీ ఇంటింటి ప్రచారం..

లాలాపేట: పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ, సికింద్రాబాద్ ఎంపీ అభ్యర్థి కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డిని గెలిపించాలని కోరుతూ.. ఆదివారం ఆ పార్టీ శ్రేణులు తార్నాకలో పలు పోలింగ్ బూత్‌ల పరిధిలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కిమ్మి కాలనీ, షిర్డీ సాయినగర్, గోకుల్‌నగర్, నాగార్జుననగర్ తదితర కాలనీల్లో ఓటర్లను కలిసి నమూనా ఈవీఎంల ద్వారా ఓటువేసే విధానంపై అవగాహన కల్పించారు. కమలం గుర్తుకు ఓటు వేయాలని కోరారు. ఈ సందర్భంగా మాజీ మేయర్ కార్తీకరెడ్డి మాట్లాడుతూ.. దేశ భద్రత, సమర్థవంతమైన పాలన కోసం తిరిగి మోదీని గెలిపించాలని కోరారు. నాయకులు లడ్డు, బండ శివారెడ్డి, కిరణ్‌గౌడ్, కృష్ణ, రాజు తదితరులున్నారు.

నేడు రుద్రహోమం

సనత్‌నగర్: చైత్రమాసం బహుళ త్రయోదశి తదుపరి చతుర్దశి (మాస శివరాత్రి) సందర్భంగా సనత్‌నగర్ హనుమాన్ దేవాలయం, శివాలయంలో ఉదయం 7.30 గంటలకు రుద్రహోమం నిర్వహిస్తున్నట్లు ఈఓ శ్రీనివాసరాజు ఓ ప్రకటనలో తెలిపారు.

మెట్రోస్టేషన్ మహిళా ఉద్యోగి సెల్‌ఫోన్ చోరీ

అమీర్‌పేట: అమీర్‌పేట మెట్రోరైల్ స్టేషన్‌లో పనిచేసే ఓ మహిళా ఉద్యోగి సెల్‌ఫోన్‌ను అగంతకుడు లాక్కుని పారిపోయాడు. ఎస్ఆర్‌నగర్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మహబుబాబాద్‌కు చెందిన ఎస్.శ్వేత ఎస్ఆర్‌నగర్‌లోని లేడీస్ హాస్టల్లో ఉంటూ.. మెట్రోస్టేషన్‌లో పనిచేస్తోంది. రోజు మాదిరిగా ఆదివారం ఉదయం హాస్టల్ నుంచి మెట్రోస్టేషన్‌కు నడుచుకుంటూ వెళ్తుండగా.. మైత్రీ బార్ వద్దకు రాగానే బైక్‌పై వచ్చిన ఓ అగంతకుడు చేతిలోని సెల్‌ఫోన్ లాక్కుని ఉడాయించాడు. దీంతో బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు వారు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అభివృద్ధి కోసమే కాంగ్రెస్‌లో చేరా..

కంటోన్మెంట్ కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి శ్రీగణేశ్



ఎన్నికల ప్రచారంలో శ్రీగణేశ్, పల్లె లక్ష్మణ్‌గౌడ్

కంటోన్మెంట్: కంటోన్మెంట్ అభివృద్ధే లక్ష్యంగా తాను సీఎం రేవంత్‌రెడ్డి పిలుపు మేరకు కాంగ్రెస్‌లో చేరానని కంటోన్మెంట్ కాంగ్రెస్ అభ్యర్థి శ్రీగణేశ్ అన్నారు. ఆదివారం 5వ వార్డులో ఎన్నికల ప్రచారం అనంతరం ఆయన పికెట్‌లోని తన కార్యాలయంలో మాట్లాడారు. నేడు పికెట్ చౌరస్తాలో నిర్వహించే కాంగ్రెస్ పార్టీ ప్రచారానికి సీఎం ముఖ్య అతిథిగా హాజరుకానున్నట్లు తెలిపారు. ఇప్పటికే కంటోన్మెంట్ అభివృద్ధికి పలు కీలక హామీలు ఇచ్చిన సీఎం, వారంలో రెండోసారి ఎన్నికల ప్రచారానికి రావడం ఆయన కంటోన్మెంట్‌కు ఇస్తున్న ప్రాధాన్యతకు నిదర్శనమన్నారు. బీఆర్‌ఎస్‌కు జెండా, ఎజెండా లేదన్నారు. పార్టీ ఫిరాయింపులు అంటూ తమపై దుష్ప్రచారం చేస్తున్నారన్నారు. బీఆర్‌ఎస్ అభ్యర్థికి ఇల్లే లేదంటూ సానుభూతి కోసం ప్రయత్నించడం సరికాదన్నారు. వారి కుటుంబ ఆస్తుల వివరాలు వెల్లడించకుండా ప్రజలను మోసం చేస్తున్నారని విమర్శించారు. కంటోన్మెంట్ కాంగ్రెస్ ఎన్నికల ఇన్‌చార్జి పల్లె లక్ష్మణ్‌గౌడ్, సతీష్ గుప్తా, పెద్దాల నర్సింహ తదితరులు పాల్గొన్నారు.

కంటోన్మెంట్‌పై కేంద్రం నిర్లక్ష్యం

బీఆర్‌ఎస్ మల్కాజిగిరి ఎంపీ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి



మాట్లాడుతున్న రాగిడి లక్ష్మారెడ్డి

కంటోన్మెంట్: కేంద్రం నిర్లక్ష్యం వల్లే కంటోన్మెంట్‌లో అభివృద్ధి కుంటుపడిందని బీఆర్‌ఎస్ మల్కాజ్‌గిరి ఎంపీ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి అన్నారు. కంటోన్మెంట్ అసెంబ్లీ బీఆర్‌ఎస్ అభ్యర్థి నివేదితతో కలిసి 1వ వార్డు పరిధిలోని సంచారపురి కాలనీలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. కంటోన్మెంట్‌కు కేంద్రం సకాలంలో నిధులు ఇవ్వక తీవ్ర అన్యాయం చేసిందని ఆరోపించారు. ఎంపీగా గెలిచిన వెంటనే కేంద్రం కంటోన్మెంట్‌కు బకాయి పడిన రూ.800 కోట్ల సర్వీసు చార్జీలు వసూలు చేయడంపైనే దృష్టి పెడతానన్నారు. కంటోన్మెంట్ బోర్డు మాజీ సభ్యుల సమన్వయంతో తనవంతు అభివృద్ధికి పాటుపడతానన్నారు. అమరేందర్‌రెడ్డి, నరేందర్‌రెడ్డి, సురేందర్‌రెడ్డి, స్వరూప, శర్మ, అభిరామ్, శ్రీనివాస్‌రెడ్డి, రేనాల్డ్ జోసెఫ్, బద్రుద్దీన్, మతిన్, ఆదిల్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గరుతేగ్ బహదూర్ జయంతి వేడుకలు

చిలకలగూడ: తొమ్మిదో సిక్కు మత గురువు గురు తేగ్ బహదూర్ సాహెబ్జీ– 403వ జయంతి వేడుకలు (ప్రకాశ్ పురబ్) సీతాఫల్‌మండి గురుద్వారాలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ప్రబంధక్ కమిటీ, గురుద్వారా శ్రీగురుసింగ్ సభ నేతృత్వంలో జరిగిన ఈ వేడుకల్లో సిక్కు మతస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఢిల్లీకి చెందిన సిక్కు మత బోధకులు జస్పాల్‌సింగ్‌జీ, జగదేవ్‌సింగ్‌జీ గుర్బానీ కీర్తనలు ఆలపించి, గుర్బానీ ప్రబోధాల(విచార్)ను భక్తులకు వినిపించారు. పెద్దసంఖ్యలో సిక్కులు పాల్గొన్నారు.